
సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కట్టడాల తొలగింపునకు నోటిఫికేషన్

» హైవే రోడ్డు నిర్మాణ బాధితులతో కలెక్టర్ భేటీ

వికారాబాద్/కొడంగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మీదుగా మహబూబ్‌నగర్- చించోలి వరకు జాతీయ రహదారి 163 వెడల్పులో స్ట్రక్చర్స్(కట్టడాలు) కోల్పోతున్న బాధితులతో గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం నిర్వహించారు. రోడ్డు వెడల్పులో 107 కట్టడాల్లో 55,114 చదరపు అడుగుల నిర్మాణాల తొలగింపునకు నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కట్టడాల విలువ, బోర్‌వెల్స్, చెట్ల విలువను పరిశీలించి త్వరలో పరిహారం అందిస్తామన్నారు. వారందరికీ పది రోజుల్లో నష్టపరిహారం అందించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌అండ్‌బీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ రాంబాబు, సూపరింటెండెంట్ నఫీస్ ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

నేడు వందేమాతరం సామూహిక గీతాలాపన

వికారాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ.. వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నేడు (7వ తేదీ, శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా వందేమాతరం గీతాన్ని సామూహిక గానం చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేగ్ ఆవరణలో ఉదయం 10 గంటలకు వందేమాతరం సామూహిక గీతాలాపన ఉంటుందన్నారు. కలెక్టరేట్ సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతర గేయాన్ని సామూహికంగా ఆలపించాలని కలెక్టర్ ఆదేశించారు. విధిగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో కూడా గీతాన్ని ఆలపించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మైనర్ ఇరిగేషన్‌కు ప్రత్యేక ప్రణాళిక

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి కీలకమైన మైనర్ ఇరిగేషన్ నిర్మాణాలపై సమగ్రమైన డేటాను సేకరించేందుకు సెన్సెస్.. భూగర్భ, ఉపరితల జల వనరుల ప్రణాళికకు ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో 7వ మైనర్ ఇరిగేషన్ సెన్సస్, 2వ వాటర్ బాడీస్ సెన్సస్‌పై జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవ్విన బావులు, నిస్సార గొట్టపు బావులు, లోతైన గొట్టపు బావులు, చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల వంటి చిన్న నీటి పారుదల వనరుల వినియోగం, యాజమాన్యం, సామర్థ్యంపై తాజా సమాచారం సేకరించడం దీని లక్ష్యమని తెలిపారు. 2వ నీటి వనరుల సెన్సస్ ద్వారా చెరువులు, ట్యాంకులు, సరస్సులు, జలాశయాలు వంటి నీటి వనరుల పరిస్థితి, వినియోగం, సామర్థ్యంపై సమగ్ర వివరాలు లభిస్తాయన్నారు. ఇవి నీటి సంరక్షణ, మత్స్య సంపద అభివృద్ధి పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతాయని వివరించారు. ఈ డేటా ఆధారంగా నీటి వనరులను స్థిరంగా వినియోగించేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలు సిద్ధం చేయనుందన్నారు. ఈ సర్వేలో జీపీవోలు, ఏఈవోలు, టీఏలు, ఎఫ్‌ఏలు గణనదారులుగా, ఏఈఈ(ఇరిగేషన్) ఎంపీఎస్‌ఓలు సూపర్‌వైజర్లుగా, తహసీల్దార్లు చార్జ్ ఆఫీసర్లుగా మునిసిపాలిటీల్లో మునిసిపల్ కమిషనర్లు సెన్సస్ ఆఫీసర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు సమీక్షలో వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌వో మంగీలాల్, సీపీవో వెంకటేశ్వర్లు, డీఏఓ రాజారత్నం, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీజీడబ్ల్యూఓ రవి, ఏడీఈ/టీజీఎస్‌పీడీసీఎల్ రామచంద్రయ్య, డీపీఆర్ఈ ఉమేశ్ కుమార్, సీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలో కవర్లు కప్పిన ధాన్యం రాశులు

మొగులు గుబులు

వర్షాలతో జంకుతున్న అన్నదాతలు

ఇప్పటికే సగానికిపైగా వరికోతలు పూర్తి
కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతున్న ధాన్యం
వానాలకు నల్లబారుతున్న వడ్లు
తేమశాతం పేరుతో కొనుగోళ్లకు కొర్రీలు
ఆందోళన వ్యక్తం చేస్తున్న మేడ్చల్ జిల్లా రైతులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే తీరా పంటచేతికొచ్చే సమయానికి వరుణుడు బెంబేలెత్తిస్తున్నాడు. మొంథా తుపాను పెను ప్రమాదం నుంచి బయటపడ్డాం అనుకునేలోపే మళ్లీ ఉరుములు, మెరుపులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందో అర్థంగాక కొనుగోలు కేంద్రాల్లోని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సమయంలో వరికోతలు చేపట్టాలంటే జంకుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం అక్కడే మగ్గుతోంది. దీంతో రైతులు 24 గంటలు అక్కడే ఉంటూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. అవుశాపూర్, అంకుశాపూర్, మాదారం, ఎదులాబాద్, బొక్కొనిగూడ, చందుపట్లగూడ, మర్రిపల్లిగూడ, ప్రతాప్‌సింగారం, ఘనాపూర్, పోచారం, వెంకటాపూర్, ఘట్‌కేసర్, అన్నోజిగూడ, కాచవానిసింగారంల్లో ఇప్పటికే వరికోతలు ఊపందుకున్నాయి. సగం కోతలు పూర్తవగా ఇంకా సగానికి పైగా వరిపైరు కోతకు సిద్ధంగా ఉంది.


అంకుశాపూర్‌లో కోతకు సిద్ధంగా వరిపైరు

కొనుగోలు కేంద్రాల్లో ఫుల్లుగా..

రాత్రి సమయాల్లో ముసురు వర్షం పడుతుండటంతో రైతులు ధాన్యంపై కవర్లు కప్పడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి రాశుల కిందికి వరద నీరు వచ్చి

మిగతా 8వ పేజీలో...



వర్షాలతో భయమేస్తోంది

వరిపైరు కోతకు సిద్ధంగా ఉంది. కానీ మబ్బులను చూస్తే భయమేస్తోంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ వర్షాలకు పొలంలో బండ్లు దిగబడుతుండటంతో హార్వెస్టర్ యంత్రాల వాళ్లు కోతలకు ముందుకు రావడం లేదు.

-చిలుగూరి జంగయ్య, రైతు మర్రిపల్లిగూడ

అటవీ భూముల రక్షణకు పటిష్ట చర్యలు

» జిల్లా అటవీ శాఖ అధికారి వేణుమాధవ్



మేడ్చల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని అటవీ శాఖ భూముల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి వేణుమాధవ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 18వేల ఎకరాల అటవీ భూములు ఉన్నాయన్నారు. జిల్లాలో అటవీ శాఖ భూముల్లో 20 పార్కులు ఉన్నాయన్నారు. ఈ పార్కులను సందర్శకుల కోసం మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా లక్ష్యానికి మించి 3 లక్షల మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అటవీ శాఖ భూముల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో కొన్ని కోర్టు వివాదాలు కూడా ఉన్నాయని, అవి పరిష్కారం కాగానే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్ల కోసం ధర్నా.. 25మందిపై కేసులు

తాండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ప్రజలకు, రవాణా ఆటంకం కగిలిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఈ నెల 4వ తేదీన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో విలియం మూన్ చౌరాస్తాల రాస్తారోకో చేసిన 25మందిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు పోలీసులు తెలిపారు. తాండూరు కానిస్టేబుల్ అఖిలేష్ ఫిర్యాదు మేరకు తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు కమల్తార్, బాసిత్, గోపాలకృష్ణ, జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, సీసీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్, పట్టణ బీజేపీ అధ్యక్షులు నాగారం మల్లేశం, టీజీఎస్ తాండూరు ఇన్‌చార్జి సోమశేఖర్, మాజీ కౌన్సిలర్లు పరిమళ, అసిఫ్, శోభరాణి, సంగీత ఠాకూర్, సాజిద్, నాయకులు సుకుర్, ఇంతియాజ్, స్వామి, రవూఫ్, అబ్దుల్, తదితరులపై కేసులు నమోదు చేశారు.

బొమ్మరాశిపేటకు డంప్ యార్డును తరలించొద్దు



» కలెక్టరేట్ వద్ద బొమ్మరాశిపేట, పొన్నాల్ గ్రామస్తుల ఆందోళన

శామీర్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూంకుంట నుంచి శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటకు డంప్ యార్డును తరలిస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని బొమ్మరాశిపేట, పొన్నాల గ్రామాలకు చెందిన రైతులు, పలు పార్టీల నాయకులు గురువారం హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ప్రతిపాదనలు పంపిన తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతిపై ఆగ్రహిస్తూ ఆమె కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గురువారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బొమ్మరాశిపేట పరిధిలోని సర్వేనెంబరు-322లోని పశువులు మేత మేస్తున్న స్థలాన్ని డంపింగ్‌యార్డుకు ఏర్పాటుకు ప్రతిపాదించడాన్ని తాము సహించమన్నారు. అందుకు వ్యతిరేకంగా తాము రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడుతామని ఆ గ్రామస్తులు హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడుతున్న తూంకుంట మున్సిపల్ కమిషనర్‌పై కఠిన చర్యలు తీసుకునే వరకు ఊరుకోమని హెచ్చరించారు. బొమ్మరాశిపేటలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనను విరమించుకోవాలని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాధిక గుప్తాను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బొమ్మరాశిపేట మాజీ ఉపసర్పంచ్ రవికిరణ్‌రెడ్డి, పొన్నాల్ మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేశ్, గ్రామాల నాయకులు లక్ష్మారెడ్డి, బాల్‌ర్సింహ, దేవేందర్‌రెడ్డి, తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై అనంతుడు

అనంతగిరిలో కార్తీకమాసం పెద్ద జాతర కనుల పండువగా జరుగుతోంది. గురువారం స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. ఆలయ పుర వీధుల్లో స్వామిని ఊరేగించి పుష్కరిణి వరకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-వికారాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)


ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

అప్పా- మన్నెగూడ రోడ్డు పూర్తి చేయాలి

» రోడ్డు ప్రమాద ఘటనపై విద్యార్థి, ప్రజా సంఘాల నిరసన

వికారాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అప్పా- మన్నెగూడ రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాలు, వైద్యులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రజా సంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆలంపల్లి చౌరస్తా నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు శ్రద్ధాంజలి ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రమాద రహిత రహదారులు కావాలి.. ప్రాణాలకు విలువ ఇవ్వాలి.. అంటూ నినాదాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రోడ్ల పునర్నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నా బాధ్యులపై చర్యలు తీసుకోక పోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్ల దుస్థితి కారణంగా ప్రతీ సంవత్సరం వేలాది మంది ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రవాణా శాఖలో జవాబుదారీతనం లేక పోవడమే సమస్యలకు కారణమని, దీనికి బాధ్యత వహిస్తూ రవాణా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ప్రజా ప్రయాణ భద్రత కోసం, ప్రజా సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వికారాబాద్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, ఆనంద్, డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ● ఒక్కో కుటుంబానికి రూ. 20వేల అందజేత 7


దివ్యాంగులకు కేక్ తినిపిస్తున్న డీఆర్‌డీవో సాంబశివరావు

మానసిక దివ్యాంగులను ఆదరించాలి

» డీఆర్‌డీవో సాంబశివరావు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో మానసిక దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని, ఆదరించాలని డీఆర్‌డీవో సాంబశివరావు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ నైబర్‌వుడ్ సెంటర్‌లో గురువారం దివ్యాంగుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ నైబర్‌వుడ్ సెంటర్‌లో మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయిస్తున్నారని, తల్లిదండ్రులు ప్రతిరోజు ఇంటి వద్ద వారి పిల్లలచే సాధన చేయించాలన్నారు. అనంతరం మానసిక దివ్యాంగులచే కేక్ కట్ చేయించి వారికి తినిపించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ శంకర్, డీపీఎం నందర్, ఏపీఎం స్వామి, కమ్యునిటీ కో-ఆర్డినేటర్ శంకర్, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

» రాష్ట్ర గురుకుల బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ తిరుపతి


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సెక్రటరీ తిరుపతి

శామీర్‌పేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని రాష్ట్ర గురుకుల బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ తిరుపతి పిలుపునిచ్చారు. గురువారం శామీర్‌పేట పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల బీసీ పాఠశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ఆర్‌సీవో గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్‌తో కలసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లోని ఒత్తిడిని తగ్గించి మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం గురుకుల ఆర్‌సీవో మాట్లాడుతూ క్రీడాపోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తాయన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ పాఠశాల గ్రౌండ్స్‌లో 6 నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లా పరిధిలోని గురుకుల బీసీ వెల్ఫేర్ విద్యార్థులకు పెద్ద సంఖ్యలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఓఎస్‌డీ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ శశివర్ధన్ రెడ్డి, ఏటీపీలు శేఖర్, హెప్సిబా, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీఈటీలు సాయిబాబా, సాయికుమార్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు నరేష్, టెన్దూల్‌కర్ పాల్గొన్నారు.

పోటీల్లో 16 గురుకులాల విద్యార్థులు

అండర్ - 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నికాయిట్, చెస్ వంటి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో హైదరాబాద్ జిల్లా పరిధిలోని 16 ప్రభుత్వ గురుకుల బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు.

పీఎంశ్రీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసిన డీఈవో

మేడ్చల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీఎంశ్రీ నిధుల గోల్‌మాల్‌పై జిల్లా విద్యాధికారి విజయకుమారి గురువారం విచారణ చేపట్టారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పీఎంశ్రీ నిధులు గోవిందా!' పేరుతో ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. దొంగ బిల్లులతో ఏకంగా తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకే నిధులు మళ్లించుకున్నారన్న ఆరోపణలపై నిజాంపేట ఉన్నత పాఠశాలలో ఆమె రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విచారణ జరుగుతోందని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: టీఎస్‌యూటీఎఫ్

పీఎంశ్రీ నిధులు స్వాహా చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయసింహారెడ్డి, మధన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం వెచ్చించాల్సిన నిధులను స్వాహా చేయడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న విజయకుమారి

ఓటరు జాబితా పరిశీలన

దుద్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలు సమమావేశమయ్యారు. ఓటరు జాబితాను పరిశీలించారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. బీఎల్‌వోలు సరి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉశప్ప, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని విమర్శించే అర్హత కార్తీక్‌రెడ్డికి లేదు

- చేవెళ్లలో దశాబ్దాలపాటు పట్లోళ్ల కుటుంబం పాలన
- అభివృద్ధి శూన్యం : మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రత్నం

చేవెళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వార్డు మెంబర్‌గానైనా గెలవని పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఇష్టానుసారం విమర్శించే నైతిక అర్హత లేదని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. గురువారం చేవెళ్లలో బీజేపీ నాయకులతో కలిసి రత్నం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు చేవెళ్ల నియోజకవర్గాన్ని పట్లోళ్ల కుటుంబమే పాలించి అభివృద్ధి మాత్రం చేయలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి తెచ్చిందే ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అని చెప్పారు. పంచాయతీ వార్డు మెంబర్‌గానైన గెలువని బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి తన ఇష్టం వచ్చినట్టు స్థాయికి మించి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిపై ఏకవచనంతో సంబోధిస్తూ మాట్లాడటం అనైతికం అన్నారు. జాతీయ రహదారి నిర్మాణం విషయంలో ఎంపీ మాట్లాడిన మాటలను కార్తీక్‌రెడ్డి వక్రీకరిస్తూ తనకు అనుకూలంగా మాట్లాడి అతి తెలివి ప్రదర్శించాడన్నారు. ప్రాణహిత మొబిలైజేషన్ పేరుతో రూ.800కోట్లు దిగమింగారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి చేవెళ్ల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఇక్కడ ఆర్టీసీ డిపో, జూనియర్ కళాశాల లేవన్నారు. చేవెళ్ల సెంటిమెంట్‌ను వాడుకొని వారి కుటుంబం లబ్ధిపొందిందని, ఇక్కడి ప్రాంతం వారికి రాజకీయ భిక్ష పెట్టిందన్నారు. కేటీఆర్ మెప్పు కోస మే కార్తీక్‌రెడ్డి ఎంపీపై స్థాయికి మించి విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే యాదయ్య జీవో111 ఎత్తివేయిస్తానని అని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్న మచ్చలేని నాయకుడు విశ్వేశ్వర్‌రెడ్డి ఒక్కడే అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఈ నియోజవర్గానికి చేసిందేమీ లేదని, హైదరాబాద్- బీజాపూర్ రోడ్డుకు నిధులు తానే తెచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటూ ఫొటోలు, వీడియోలు దిగుతూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్గారి వైభవ్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, జైశంకర్, వెంకట్రామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, గాలయ్య, అభిషేక్‌రెడ్డి, అశోక్, కరుణాకర్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, గణేశ్ ఉన్నారు.

భూములిచ్చే రైతులకు పరిహారం, ఇంటి స్థలం

కందుకూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి):టీజీఐఐసీకి భూములు ఇచ్చే ప్రతీ రైతుకు పరిహారంతో పాటు ఇంటి స్థలం కేటాయిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. నాగిరెడ్డిపల్లిలో 198ఎకరాల్లో ప్రభుత్వం ఐటీ పార్కును ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇందుకు 94 మంది రైతుల నుంచి సేకరించే భూములకు మార్కెట్ రేట్ ప్రకారం ఎకరాకు రూ.1.1కోట్లతో పాటు హెచ్ఎండీఏ అభివృద్ధి చేసే వెంచర్‌లో ప్రతీ ఎకరం భూమికి 121గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో ఐఐసీ జోనల్ మేనేజర్ గణేష్, మహేశ్వరం తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, కార్యాలయ డీటీ రాజు, మహేశ్వరం ఆర్ఐ స్వర్ణకుమారి, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల చైర్‌పర్సన్లను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఒబేదుల్లా కొత్వాల్, రాంరెడ్డితో గుర్రం కేశవులు

ఆమనగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలను కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు ఉపాధి కల్పనకు తోడ్పాటును అందించాలని, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. అనంతరం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. శ్రీనివాస్, పుల్లయ్య, రవికుమార్, శేఖర్, సుభాష్, మనోహర్, లక్ష్మయ్య, నరేందర్, అశోక్ పాల్గొన్నారు.

కల్వ సుజాతను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

తలకొండపల్లి: మండల కాంగ్రెస్ నాయకులు గురువారం రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతను కలిశారు. హైదరాబాద్‌లో సుజాతను కలిసి సత్కరించారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి, ఉపాధికి కార్పొరేషన్ తోడ్పాటునందించాలని కోరినట్లు నాయకులు పేర్కొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతశ్రీ, ఎస్సై మహేందర్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కందుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, డ్రగ్స్‌కు బానిసైతే జీవితం నాశనమేనని మహేశ్వరం సీడీపీవో శాంతశ్రీ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గూడూరు గేటు వద్ద గల బాలికల గురుకులంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు విద్యతో పాటు క్రీడారంగాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిర్మూలనకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు అలవాటైతే జీవితం అంధకారమవుతుందన్నారు. కార్యక్రమంలో గూడూరు మెడికల్ ఆఫీసర్ సంధ్య, అంగన్‌వాడీ సూపర్వైజర్ ఇందిర, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీకిరణ్, టీచర్లు, అంగన్‌వాడీలు యశోద, సుమతి, దీప, బాలికలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జేఎల్ఎం మృతి

» లారీ-బైక్ ఢీకొనడంతో దుర్మరణం



ముజాహిద్(ఫైల్)

మంచాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి ఆగాపల్లి-సాగర్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మన్ దుర్మరణం చెందాడు. ఎస్సై వంశీ తెలిపిన వివరాల మేరకు.. యాచారం మండలం మేడిపల్లికి చెందిన మహమ్మద్ ముజాహిద్(26) కొత్తూరులో ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ముజాహిద్ బుధవారం విధులు ముగించుకొని రాత్రి 10గంటల సమయంలో తన బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఆగాపల్లి చౌరస్తా వద్ద ఎదురుగా.. ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న లారీ(ఆర్‌జే11 జీబీ4402) బైక్‌ను ఢీకొట్టింది. లారీ ముందు టైరు ముజాహిద్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముజాహిద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీ తెలిపారు.

టీడీఎఫ్ నాయకులపై కేసులు హేయం



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

తాండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం నాయకులపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. చేవెళ్ల బస్సు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మృతి చెందడం బాధాకరం అన్నారు. రోడ్లు బాగలేకే ఎంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వ తీరుకు నిరసనగా తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం నాయకులు ఆందోళన చేశారన్నారు. వారిపై పోలీసులు కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గత మంగళవారం తాండూరు విలియమూన్ చౌరస్తా వద్ద ధర్నాలో పాల్గొన్న వారిపై కేసులు పెట్టడం హేయమైన చర్య అని అన్నారు. వెంటనే కేసులను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

» నారా భువనేశ్వరి సేవలకు అంతర్జాతీయ గుర్తింపు

» టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సిములు



కొడంగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదల కోసం అందిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సిములు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా నారా భువనేశ్వరి సేవలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 27సంవత్సరాలుగా విద్య, వైద్యపరంగా సేవలు అందిస్తున్నారన్నారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో 2017లో మెగా శిబిరం నిర్వహించి 129 మంది రైతులకు రూ.78లక్షల చెక్కులను అందించినట్లు గుర్తుచేశారు. పశువులకు వైద్య చికిత్సలు అందిస్తూ, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పేద పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయి గోల్డెన్ పికాక్ అవార్డును నారా భువనేశ్వరి అందుకోనున్నారని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ ఆదర్శ నేతగా గుర్తింపు పొందితే.. ఆయన సతీమణి భువనేశ్వరి సామాజిక సేవలకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం గర్వించదగ్గ విషయం అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సన్నద్ధం

కందుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర కల్పించడానికి ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఏపీవో పి.నరేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం రూ.2,369 చొప్పున చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేవీవీ పోస్టర్ ఆవిష్కరణ

మాడ్గుల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జీవన పద్ధతులు, ఆచార వ్యవహారాలు, సైన్స్‌తోనే జీవన మనుగడ సాగుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు, ఇర్విన్ ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు అన్నారు. ఈ మేరకు ఇర్విన్ జెడ్పీ పాఠశాలలో గురువారం తెలంగాణ ప్రభుత్వం జన విజ్ఞాన వేదిక ద్వారా ప్రతీయేటా నిర్వహించే చెకుముకి సంబరాలు-2025 వాల్‌పోస్టర్లను ఎంఈవో సర్దార్‌నాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రపంచంలో చాలా దేశాలు సైన్స్ ఆధారంగా ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నాయని అన్నారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

దుద్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టీశాట్ ద్వారా ఎంపిక చేసిన తేదీల్లో విద్యార్థులు నైతిక విలువలతో కూడిన పాఠాలపై ప్రసారం చేస్తున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, మల్లప్ప, రాములు, రవినాయక్, ముకుందరెడ్డి, శ్రీనివాసులు, సాలిబాయి, తదితరులు పాల్గొన్నారు.

మీర్జాగూడ ప్రమాద బాధిత

కుటుంబాలను ఆదుకుంటాం

» చెక్కులు అందజేసిన చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

» రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచన



మృతుల కుటుంబాలను ఓదార్చి ఆర్థికసాయం అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్సు-కంకర టిప్పర్ ఢీకొన్న ఘటనలో 19మంది మృతిచెందగా, 21 మంది గాయాలపాలైన విషయం తెలసిందే. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి గురువారం తాండూరులో పర్యటించి 13మంది మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇందిరమ్మ కాలనీలోని సాహెల్, ఖాలీద్‌లతో పాటు రెండు నెలల శిశువు కుటుంబానికి, వాల్మీకి కాలనీ ఉండే వెంకటమ్మ, విశ్వంభర(బృందావనం) కాలనీలో తబస్సుమ్, గౌతాపూర్‌లో ఉండే ముస్కాన్ బేగం, పాత తాండూరులోని దస్తగిరి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన రూ.7లక్షలకు అదనంగా తన సొంతంగా ఒక్కో కుటుంబానికి రూ. 20వేల సాయాన్ని అందించారు. యాలాల మండలం పేర్కంపల్లికి చెందిన ఎల్లయ్యగౌడ్ ముగ్గురు కూతుళ్ల మరణంపై మహేందర్‌రెడ్డి కలత చెందారు. ఎల్లయ్య గౌడ్ కుటుంబంతో పాటు లక్ష్మీనారాయణపూర్‌నకు చెందిన అఖిల, హాజీపూర్ వాసులు బందెప్ప, లక్ష్మి దంపతుల కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని తబస్సుం కుటుంబీకులకు హామీ ఇచ్చారు.

మానవ తప్పిదాలవల్లే ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు చాలా వరకు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మీర్జాగూడ వద్ద జరిగిన ప్రమాదం, అలాగే గతంలో ఆలూరు రోడ్డు ప్రమాదం వంటివన్నీ డ్రైవర్ల నిర్లక్ష్యం, మితి మీరిన వేగం వల్లే జరిగాయని అన్నారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు వైడెనింగ్‌కు గ్రీన్ ట్రిబ్యునల్ సమస్య పరిష్కరమై పనులు చేపట్టాలనుకుంటున్న తరుణంలో ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరం అన్నారు. తాను మంత్రిగా ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేశామని, బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. వికారాబాద్-తాండూరు రోడ్డుకు సైతం నిధులు ఇచ్చి, పనులు చేయించానని, తన ఓటమి తర్వాత ఆ రోడ్డును ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల సీఎం చొరవతో ఈ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సమన్వయ కర్త కరుణం పురుషోత్తంరావు, నాయకులు సిద్రాల శ్రీనివాస్, రవీందర్, రఘు, అబ్దుల్ ఘని, భగవాన్, సంకేత్, సిద్ధు తదితరులు ఉన్నారు.

రోడ్లను బాగుచేయండి మహాప్రభో ...

● పలు గ్రామాల ప్రజల నిరసన ర్యాలీ

పూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్లకు మరమ్మతులు, నూతన నిర్మాణాలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల ప్రజలు ర్యాలీ నిర్వహించారు. గురువారం పూడూరు మండలం మేడిపల్లికలాన్ నుంచి చిట్టంపల్లి గేటు వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు మాట్లాడుతూ.. ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోనూ రోడ్లు సరిగ్గా లేక ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు సరిగ్గా లేకే తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నాయన్నారు. కొన్నేళ్లుగా ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండల పరిధిలోని ప్రధాన, గ్రామీణ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. అధికారులు స్పందించి కొత్తగా రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మేడిపల్లికలాన్-చిట్టంపల్లి గేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

రోడ్డు ప్రమాద బాధితుడికి చీఫ్ విప్ పరామర్శ



జగదీశ్ పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్న మహేందర్‌రెడ్డి

వికారాబాద్/తాండూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చంద్రవంచ వద్ద ఆటో ప్రమాదంలో గాయపడి వికారాబాద్‌లోని ఈశ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న జగదీశ్‌ను గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. జగదీశ్ ఆరోగ్య స్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మహేందర్‌రెడ్డితో పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు రత్నారెడ్డి, వెంకట్‌రెడ్డి, పి.సాయిరెడ్డి, అశోక్, శేఖర్, యువకుడి సోదరుడు ప్రశాంత్ ఉన్నారు.

బస్సు ప్రమాద మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



హన్మంతు భార్యకు చెక్కును అందజేస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చేవేళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మండలంలోని నీటూర్‌కు చెందిన మల్లగల్ల హన్మంతు మృతిచెందాడు. ప్రభుత్వం తరఫున అతడి కుటుంబానికి మంజూరైన ఆర్థిక సహాయం రూ.7లక్షల చెక్కును గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేశ్‌కుమార్‌లు స్థానిక నాయకులతో కలిసి హన్మంతు భార్య కాశమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకట్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి

ప్రభుత్వం సానుకూలం

» తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

» పొద్దటూర్‌లో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం

శంకర్‌పల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఐజేయూ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పొద్దటూర్‌లో గల ఓ రిసార్ట్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్‌అలీ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాస్‌రెడ్డితో జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వంతో చర్చించినట్లు చెప్పారు. 2026 ఫిబ్రవరి మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజేయు) ప్లీనరీ విజయవంతానికి సన్నాహాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా జనవరిలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సమస్యలను విస్మరిస్తే ఆందోళనలే ...

ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే ఆందోళనలు తప్పవని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(టీయూడబ్ల్యూజే) స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చి రెండేళ్లు అవుతున్నా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదంది. ఇళ్ల స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రిడిటేషన్ల జారీని త్వరగా పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ గెలుపునకు కృషిచేసిన విరాహత్ అలీని, నాయకులను అభినందించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన 16మంది జర్నలిస్టులకు నివాళులు అర్పించారు. సమావేశంలో ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ, యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు సత్యనారాయణ, మాజిద్, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కిషన్, సంపత్‌కుమార్, సలీంపాషా, మధుగౌడ్, ఎం.వెంకట్‌రెడ్డి, యూసుఫ్, బాబు, అశోక్, యాదయ్య, మల్లికార్జున్, జిలానిపాషా పాల్గొన్నారు.



శివకుమార్‌ను అభినందిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

టీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా శివకుమార్

తాండూరు: టీయూడబ్ల్యూజే-ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కుల్కచర్ల శివకుమార్ ఎంపికయ్యారు. ఆయనను యూనియన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఎంపికచేశారు. శివకుమార్‌ను ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే నాయకులు అభినందించారు.

బీఆర్ఎస్, బీజేపీలను

నమ్మి మోసపోవద్దు



ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాజకీయాల లబ్ధికి కుట్ర చేస్తున్నాయని, వాటిని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాడుగుల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండగల్‌రెడ్డిలు అన్నారు. వారికి ప్రజలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు, మాడుగుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడలో ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికేదైనా విజయం కాంగ్రెస్‌దే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు గుర్రం కేశవులు, యాట నర్సింహ, జక్కు అనంతరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మహేందర్, యాదయ్య, డేవిడ్, కృష్ణ, మంగ్లీ రాములు, రమేశ్, జగన్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, ఫరీద్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం



ఎన్నికల ప్రచారంలో భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ ఉప ఉన్నిక ప్రచారంలో ఆయన సోమాజీగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ చేస్తున్న, చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు మద్దతుగా నవీన్‌యాదవ్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికల తరహాలోనే ఇప్పుడు కూడా బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటై కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తున్నాయని, కుమ్మక్కు రాజకీయాలు ఎన్ని చేసినా కాంగ్రెస్‌దే విజయ అని దేప ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

ఎక్కువ కేసుల్లో రాజీపడేలా చేయాలి

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీపడేలా న్యాయవాదులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మేడియేషన్ యాక్ట్ 2023 ప్రకారం కోర్టు ఆవరణలో చేపడుతున్న కార్యక్రమాలు స్వచ్ఛందంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శాంతిలత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బస్వారాజ్, శంకరయ్య, వెంకట్ రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతర పార్కింగ్‌కు నేడు వేలం

ధారూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): 11వ తేదీ నుంచి 16 వరకు నిర్వహించే ధారూరు మెథడిస్టు జాతరకు వాహనాల పార్కింగ్‌నకు నేడు (7వ తేదీన) వేలం నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్టేషన్ ధారూరు, దోర్నాల గ్రామ పంచాయతీల ఆవరణలో వేర్వేరుగా వాహనాల పార్కింగ్‌లకు వేలం జరుగుతుందని చెప్పారు. ఇందులో పాల్గొనే వారు స్టేషన్ ధారూరులో రూ.2వేలు, దోర్నాల్‌లో రూ.5 వేలు నగదు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ డిపాజిట్ తిరిగి ఇవ్వబడదని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు, వారి కుటుంబ సభ్యులు పంచాయతీలలో ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు. పార్కింగ్‌కు దక్కించుకున్న వారు ద్విచక్ర వాహనాలకు రూ.50, నాలుగు చక్రాల వాహనాలకు రూ.100 చొప్పున వసూలు చేసుకోవచ్చని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

కనుల పండువగా సీతారాములు..

శివపార్వతుల కల్యాణం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సీతారాముల, శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శావపై స్వామివార్లను ఊరేగించారు. అనంతరం ఆలయ అవరణలో సీతారాములు, శివపార్వతుల మూర్తులకు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రమాదేవి, ధ్వజస్తంభ దాతలు శ్రీనాథ్‌రావు, రాజలింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీతారాములు, శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు



కళాశాలలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అడిషనల్ డీసీపీ పూర్ణచంద్ర

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శంషాబాద్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీసీపీ పూర్ణచంద్ర సూచించారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా గురువారం వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన డీసీపీ మాట్లాడుతూ... గుర్తుతెలియని వ్యక్తులు బంధువుల, పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు వేయాలని కోరితే స్పందించొద్దన్నారు. ఎవరైనా ఏ విషయంలోనైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు బలికావొద్దని సూచించారు. సోషల్‌మీడియాలో వచ్చే ప్రకటనలకు స్పందించొద్దని చెప్పారు. ఈ మేరకు అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐలు నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, దుర్గాప్రసాద్, ఎస్సై సాదత్ అలీ పాల్గొన్నారు.

దీపాలు వెలిగిస్తుండగా

అంటుకున్న నిప్పు

» చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కీసర రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దీపాలు వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఏడేళ్ల చిన్నారి మృతిచెందింది. ఈ సంఘటన గురువారం కీసర మేడ్చల్ జిల్లా మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి నాగారం మున్సిపాలిటీ ఆర్‌ఎల్‌నగర్‌కాలనీ, రెక్వెల్‌ఫోర్ట్ స్కూల్ సమీపంలో కుటుంబంతో ఉంటున్నాడు. కార్తీక పౌర్ణమి నాడు బుధవారం ఇంటి కుటుంబ సభ్యులు దీపాలు వెలిగిస్తున్నారు. ప్రమాదవశాత్తు తన కుమార్తె సాయినేహారెడ్డి(7)కి నిప్పంటుకుంది. గమనించిన తల్లితండ్రులు చిన్నారిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. 90శాతం కాలడంతో పరిస్థితి విషమించి బాలిక చనిపోయింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మొగులు గుబులు



అంకుశాపూర్‌లో ధాన్యం తడవకుండా రాశులపై కప్పిన కవర్లు

(ఐదో పేజీ తరువాయి)

చేరుతోంది. ఇటీవల కురుసిన వర్షాలకు ధాన్యం తడిసి నల్లగా మారింది. ధాన్యం ఆరబెట్టిన తర్వాత తుర్పార పట్టడానికి వీలు లేకుండా గత నాలుగైదు రోజుల నుంచి వాతావరణం పూర్తిగా మబ్బులతో నిండి ఉంటుంది. చేసేది లేక ధాన్యం రాశులపై కవర్లు కప్పి ఉంచుతున్నారు. దీంతో ధాన్యం తేమ ఉండటంతో అధికారులు కొనుగోళ్లు చేపట్టడం లేదు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాతే కోతలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ధాన్యం రాశులతో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు నిండుగా ఉన్నాయని, అక్కడ ఆరబెట్టుకునే అవకాశం లేదన్నారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

రైతు సేవాసహకారం సంఘం ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఎదులాబాద్, అంకుశాపూర్, అవుశాపూర్, మాధారం పోచారం మున్సిపాలిటీలోని ప్రతాప్‌సింగారంల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎదులాబాద్, అంకుశాపూర్‌లో కొనుగోలు కేంద్రాలను అక్టోబరు 18న ప్రారంభించారు. కాగా, ఇప్పటి వరకు ఎదులాబాద్‌లో కేవలం 4,500 బస్తాలు, అంకుశాపూర్‌లో 2,200 బస్తాల ధాన్యం మాత్రమే సేకరించారు. దీంతో సెంటర్లల్లో ధాన్యం కుప్పలు కుప్పలుగా మగ్గుతోంది. ధాన్యంలో తేమ ఉందంటూ కొనుగోళ్లకు కొర్రీలు పెడుతున్నారు.

వర్షాలు తగ్గిన తర్వాతే కోతలు



వరికోతలు చేపట్టని రైతులు వర్షాలు తగ్గే వరకు ఆగాలి. ఇప్పడికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఫుల్‌గా ఉంది. ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాలు పడుతున్నందున పైరు కోయకుండా ఉండటమే మంచిది. రైతులు అందరూ గమనించాలి.

- లావణ్య, మండల వ్యవసాయ అధికారి, ఘట్‌కేసర్

తేమశాతం బట్టి కొనుగోళ్లు

ధాన్యంలో తేమశాతం 17కు మించి ఉండకూడదు. నిబంధనల ప్రకారమే ధాన్యం సేకరిస్తాం. వారం రోజుల నుంచి వాతావరణంలో మబ్బులు రావడం వల్ల ధాన్యం ఆరడం లేదు. ఇప్పటి వరకు 7 వేల బస్తాల ధాన్యంను మిల్లులకు తరలించాం. రైతులు అధికారులకు సహకరించాలి. ప్రతిగింజ కొనుగోలు చేస్తాం.

-రాహుల్ రాజ్, రైతు సేవా సహకార సంఘం ఎండీ ఘట్‌కేసర్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, డీఆర్‌డీఏ సెర్ప్, డీఎంఅండ్ హెచ్‌వో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 112 మందికి పరీక్షలు నిర్వహించగా 32 మందికి శస్త్ర చికిత్సల నిమిత్తం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్, డీపీఎం కొమురయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఏపీయం మధుకర్, వైద్యాధికారి సృజన, బాల్‌రాజ్, సూపరిండెంట్ రాజమల్లయ్య, చంద్రకాంత్, మైపాల్, ఏజాజ్ పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధి పనుల్లో జాప్యం ఎందుకు?

కొడంగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పనుల్లో జాప్యం ఎందుకు చేస్తున్నారని మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. కొడంగల్‌లో ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంబేడ్కర్, వినాయక చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

అక్రమ కేసులు కొట్టేయాలి

కొడంగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన చేపడుతున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం సరైంది కాదని సీపీఐ నియోజవర్గ నాయకుడు సురేశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో రోడ్డు విస్తరణ చేపట్టాలని తాండూర్‌లో నిరసన వ్యక్తం చేస్తే ప్రభుత్వం సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేయడం సరైంది కాదన్నారు. ప్రజాపాలన అని చెబుతున్న ప్రభుత్వం ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కేసులను ఎత్తివేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో వెంకట్

దోమ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంజిపల్లి, గంజిపల్లి తండా, కొండాయపల్లి, బడెంపల్లి పాఠశాలలను ఎంఈవో వెంకట్ గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే విధంగా టీఎల్ఎం విధానంలో బోధించాలని సూచించారు. బడెంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పరిపూర్ణ, శ్రీనివాసులు, కన్నయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాంచందర్

చౌడాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో గురువారం ఎంఈవో రాంచందర్ సమావేశమయ్యారు. విద్యార్థులు చదువులో ఏ విధంగా రాణించాలి, పరీక్షల్లో తప్పుల్లేకుండా రాయడం తదితర అంశాలను వివరించారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

హూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హూడూరు మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామంలో మార్క్‌ఫెడ్ పర్యవేక్షణలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం కొనసాగుతుందని పేర్కొన్నారు. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.2,400 ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చే మొక్కజొన్నలు నాణ్యతగా తీసుకురావాలని కోరారు.

వాట్సాప్ స్టేటస్‌లో ‘ద ఎండ్’

మూడో అంతస్తు నుంచి దూకిన నర్సింగ్ విద్యార్థిని

పరిస్థితి విషమం.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ స్టేటస్‌లో ‘ద ఎండ్.. మరుసటి రోజు కళాశాల మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది ఓ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల కేంద్రానికి చెందిన మల్లి పూజిత(23) అన్నోజిగూడలో అద్దెకుంటూ అవుశాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నీలిమా స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. పూజితకు జ్వరం రావడంతో గురువారం కళాశాలకు ఆమె స్నేహితురాలుతో కలిసి ఆటోలో వచ్చింది. మధ్యాహ్నం లంచ్‌కు రాకుండా 1.30 గంటలకు చాలాసేపు ఫోన్‌లో మాట్లాడి రెయిలింగ్‌పై ఫోన్ పెట్టి కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో గమనించిన విద్యార్థులు కళాశాల డీన్ సాయంతో ప్రథమ చికిత్స నిమిత్తం జోడిమెట్లలోని నీలిమా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పూజిత ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను ఆమె స్నేహితులను అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో కళాశాలకు ఆటోలో వచ్చిందని, ఉదయం ట్యాబ్లెట్ వేసుకొని టిఫిన్ చేసిందని ఆమె స్నేహితురాలు తెలిపారు. అయితే పూజిత తన ఫోన్‌లో బుధవారం సాయంత్రం ‘ద ఎండ్ అని స్టేటస్ పెట్టుకుందని తెలిపారు. ప్రేమ వ్యవహారంతోనే పూజిత ఆత్మహత్యకు యత్నించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ సత్యనారాయణ

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జోనల్ స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతి విద్యార్థి పాల్గొని ప్రతిభ చటాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహించిన దివ్యానగర్ ప్లాట్‌ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

హైడ్రాకు ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీ

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైడ్రా అధికారులు కాచవాని సింగారం, దివ్యానగర్‌లో అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేసినందుకు దివ్యానగర్ ప్లాట్ ఓనర్స్ గురువారం ర్యాలీ నిర్వహించారు. పోచారం మున్సిపాలిటీ, కాచవానిసింగారం, దివ్యానగర్‌లో తమ ప్లాట్ల వద్దకు వెళ్లకుండా ప్రహరీలు నిర్మించి, రహదారులను ఆక్రమించారని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఆఖరికి హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు రహదారులను కబ్జాల నుంచి విడిపించి ప్రహరీలను కూల్చివేసి తమకు విముక్తి కల్పించారని హైడ్రాకు ధన్యావాదాలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. హైడ్రా రంగంలోకి దిగకపోతే దివ్యానగర్‌లోని పార్కులు, రహదారులు మాయమయ్యేవని తెలిపారు. దివ్యానగర్‌లో నల్ల మల్లారెడ్డి నియంతలా వ్యహరించి తమను భయభ్రాంతులకు గురిచేశాడని తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ఫ్లెక్సీ వార్

తన ఫొటో పెట్టలేదని అలిగిన మార్కెట్ కమిటీ చైర్మన్

అప్పటికప్పుడే కొత్త ఫ్లెక్సీ ఏర్పాటు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, తదితరులు

మేడ్చల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పెట్టిన ఫ్లెక్సీ నేతల మధ్య వివాదానికి దారి తీసింది. గురువారం మేడ్చల్ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అధికారులు ప్రొటోకాల్ ప్రకారం ముద్రించిన ఫ్లెక్సీని కేంద్రం వద్ద ఏర్పాటు చేశారు. ఇందులో తమ ఫొటో లేకపోవడంతో క్రేంద్రం ప్రారంభానికి వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు సహకార సంఘం పాలక వర్గంపై మండిపడుతూ అలిగి తిరిగి వెళ్లే ప్రయత్నం చేశారు. చివరికి సహకార సంఘం చైర్మన్ రణదీప్ రెడ్డి సముదాయించి కొత్త ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో శాంతించారు. కాగా, సహకార సంఘం చైర్మన్ బీఆర్ఎస్‌కు చెందిన వారు కావడంతో ఉద్దేశపూర్వకంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఫొటోను ఫ్లెక్సీలో ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ నేతలు వాదనకు దిగినట్టు తెలిసింది. దీన్ని చూసి బిత్తరపోవడం రైతుల వంతయ్యింది.

జేఏసీ నాయకుల వినూత్న నిరసన



గేదెలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొడంగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. గురువారం కొడంగల్‌లో విద్యాసంస్థల తరలింపునకు నిరసనగా అంబేడ్కర్ చౌరస్తాలో గేదెలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ కో కన్వీనర్ సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకొని ప్రతిపాదిత ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేశ్‌బాబు, సూర్యనాయక్, మాసాని వెంకటయ్య, రమేశ్‌బాబు, పకీరప్ప, చిన్నయ్య, సాయిలు, ఖాజా, ఖాదర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యాదయ్యపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖదీర్, లింగం, మాజీ ఉప సర్పంచ్ ప్రకాశ్, మానస అన్నారు. గురువారం నవాబుపేట లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. నవాబుపేట మండల అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారన్నారు. బీజేపీ నాయకులు రోడ్ల కోసం ధర్నా నిర్వహించి ఆరోపణలు చేయడం తగదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, దమ్ముంటే ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీ నిధులతో రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. మీర్జాగూడ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శిస్తే ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధారూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రిజర్వేషన్ సాధన సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రిజర్వేషన్‌ల సాధన సమితి జేఏసీ నాయకులు గురువారం ధారూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, రానున్న శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో స్థానిక సంస్థల రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. 42శాతం రిజర్వేషన్లను ఏబీసీడీ వర్గీకరణ చేయాలని, బీసీ సబ్ ప్లాన్‌కు రూ.40 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శేఖర్, మల్లికార్జున్, రాజు, రవీందర్, ప్రశాంత్, వెంకటేశ్, బాల్‌రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

తాండూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన దత్తు(17) ఆటో బోల్తా కొట్టిన ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. గురువారం తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. చంద్రవంచ గ్రామానికి చెందిన శివాజీ యువజన సంఘం ద్వారా కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన ముద్దం శ్రీనివాస్ యాదవ్ రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం బీజేపీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న బీజేపీ నాయకులు, కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి గురువారం శ్రీనివాస్‌యాదవ్‌ను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, శ్రీను, నరసింహయాదవ్, మల్లేశ్ యాదవ్, మహేందర్‌యాదవ్, రాములు, విజయ్‌వర్ధన్, శ్రీనివాస్, వేణు, వెంకట్, లింగయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని చౌదర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 2012 -13 బ్యాచ్‌కు చెందిన లింగన్‌పల్లి గ్రామానికి చెందిన రాజుగౌడ్ అక్టోబరు 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో పూర్వ విద్యార్థులు గురువారం రూ.35 వేలు ఆర్థిక సహాయం అందించారు.



తాండూరు రూరల్: ఆర్థికసాయం చేస్తున్న నాయకులు



దోమ: బొంపల్లిలో శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న నాయకులు

క్రైం కార్నర్

అదుపు తప్పిన బైక్.. వ్యక్తి మృతి

నవాబుపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన నవాబుపేట మండలంలోని కేశవపల్లి తండా సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్టిగిద్ద గ్రామానికి చెందిన దప్పు ఆనందం(41) బైక్‌పై ఏక్‌మామిడి నుంచి సొంత గ్రామానికి వస్తుండగా కేశవపల్లి తండా సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుండ్లిక్ తెలిపారు.

పరిస్థితి విషమించి కార్మికుడు..

పరిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం నారాయణపూర్ శివారులోని సుగుణ స్టీల్ కంపెనీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ అలీ(31), రశీదు(34) కార్మికులుగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా బుధవారం పని చేస్తుండగా బ్లాస్ట్ జరిగింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలీ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

కీసర రూరల్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామానికి చెందిన వల్లపు రమేష్(42) దమ్మాయిగూడ మున్సిపాలిటీ అంకిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన ఓ రైతు వద్ద పుశువుల కాపరిగా పని చేస్తున్నాడు. కాగా, సాయంత్రం పశువులు ఇంటికి చేరినా రమేష్ ఇంటికి రాలేదు. సందేహించిన అతడి యజమాని వ్యవసాయ బావివద్దకు వెళ్లి చూడగా పశువుల పాకలో విగత జీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం మేనమామపై పెట్రోల్ పోసి నిప్పంటించిన అల్లుడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

యాలాల, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం మేనమామపై మేనల్లుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన యాలాల మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని బెన్నూరు గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణకు రెండెకరాల పొలం, ఇల్లు ఉంది. అయితే ఆ పొలం, ఇంటిని తనకు ఇవ్వాలని కృష్ణ మేనల్లుడు కుమ్మరి అర్జున్ పవార్ కోరాడు. దీనికి మేనమామ అంగీకరించలేదు. దీంతో గురువారం అర్జున్ పవార్ తన భార్య అనితతో కలిసి మేనమామ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ ఆలయంలో హుండీ చోరీ

పెద్దేముల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగిన ఘటన గురువారం వెలుగుచూసింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. రెండు సంవత్సరాలుగా హుండీలో భక్తులు వేసిన డబ్బులు ఇప్పటివరకూ లెక్కించలేదు. ఉదయం స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు హుండీ చోరీ జరిగిందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వేణుకుమార్ సిబ్బందితో వచ్చి హుండీని పరిశీలించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

మీర్జాగూడ మృతులకు కొవ్వొత్తుల నివాళి



తాండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి సాయిపూర్ 9వ వార్డులో నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సిములు కాలనీ వాసులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ



దౌల్తాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరఫస్లాబాద్ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో గిన్నెల చెరువు, గుండ్రస్‌కుంట చెరువుల్లో ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన ఉచిత చేప పిల్లలను గురువారం మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు కనకప్ప పంపిణీ చేశారు. ఆయా చెరువుల్లో వదిలేందుకు 21 వేల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూర రాజు, కూర శ్యామప్ప, శివశంకర్, తలారి చెన్నప్ప పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

దౌల్తాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ నాయకులు కుర్మని దస్తప్ప, ఆనంద్ అన్నారు. దౌల్తాబాద్ మండలానికి చెందిన రాసూరి రామప్పకు రూ.64 వేలు, కుర్మని నవ్యకు రూ.50వేలు, మహేందర్‌కు రూ.35 వేలు సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ అండగా ఉంటుందన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

హూడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతర కోసం మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యం గౌడ్ సొంత డబ్బులతో రోడ్డును చదును చేయించాడు. మండలంలోని కడుమూరు గ్రామంలో శుక్రవారం నుంచి శివాలయ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జాతరకు ఏర్పాట్లు చేశారు. అయితే గ్రామంలో రోడ్లు సరిగ్గా లేకపోవడంతో జాతరకు వచ్చే భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు నడొదందరి గురువారం ఆలయానికి వెళ్లే రోడ్డును చదును చేయించాడు. గ్రామస్తులు మాణిక్యం గౌడ్‌ను అభినందించారు.



రోడ్డును చదును చేయిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యం గౌడ్